# నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత సండ్ర





వేంసూరు: ఎంపీ బండి పార్థసారథిరెడ్డితో కలిసి ప్రచారం చేస్తున్న సండ్ర కుమారులు, పెనుబల్లి: ముత్తగూడెంలో..., తల్లాడ: ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సత్తుపల్లి, నవంబర్ 14: ముఖ్యమంత్రి కేసీఆర్ సహాయ, సహకారాలతో నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధిబాట పట్టిస్తున్న అభివృద్ధి ప్రదాత, బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సండ్ర సతీమణి మహాలక్ష్మి కోరారు. మంగళవారం పట్టణంలోని 10వ వార్డులో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలకు బొట్టుపెట్టి ఓట్లు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వానికి ప్రతి దళిత కుటుంబం అండగా నిలబడాల్సిన బాధ్యత ఉందన్నారు. గత ప్రభుత్వంలో పనితీరు...ఈ పదేళ్ల పనితీరు మీ కళ్లముందే ఉందని, ప్రజలు ఆలోచించాలన్నారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, ఆత్మచైర్మన్ వనమా వాసు, షేక్ రఫీ, అంకమరాజు, కంటే నాగలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



సత్తుపల్లి: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సండ్ర సతీమణి మహాలక్ష్మి

**చౌడవరంతండాలో..**

వేంసూరు, నవంబర్ 14: మండలంలోని చౌడవరం తండాలో రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి, సండ్ర వెంకటవీరయ్య కుమారులు సండ్ర భార్గవ్, తేజ మంగళవారం ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. తండాలను గ్రామపంచాయతీలు చేసి స్వపరిపాలన అందించిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. సండ్ర హయాంలోనే సత్తుపల్లి నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే సండ్రను అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గొర్ల సంజీవరెడ్డి, గొర్ల సత్యనారాయణ రెడ్డి, ఖాయం రాంబాబు, రాందాస్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**పెనుబల్లి మండలంలో..**

పెనుబల్లి, నవంబర్14: సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గెలుపు కోరుతూ మండలంలో బీఆర్ఎస్ నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించి కారు గుర్తుపై ఓటు వేసి సండ్ర వెంకటవీరయ్య గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రైతులకు 24 గంటలు పాటు విద్యుత్ అందించిన రాష్ట్రం ఒక తెలంగాణ రాష్ట్రం మాత్రమే అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**తల్లాడలో..**

తల్లాడ, నవంబర్14: సత్తుపల్లి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గెలుపు కోరుతూ తల్లాడ, మండలంలోని అన్నారుగూడెంలో సండ్ర కుమారులు సండ్ర భార్గవ్, తేజ, నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటు వేసి సండ్ర వెంకటవీరయ్యను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. సత్తుపల్లి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సండ్ర వెంకటవీరయ్యను గెలిపించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ దూపాటి భద్రరాజు, పట్టణ అధ్యక్షుడు జీవీఆర్, ఉపసర్పంచ్ గుండ్ల వెంకటి, వార్డుమెంబర్ తేళ్లూరి రఘు, పట్టణ యూత్ నాయకులు గుడిబండ్ల మహేశ్, గంజాయి శివ తదితరులు పాల్గొన్నారు.

# గులాబీ దళ సారథి.. పార్థసారథిరెడ్డి

**బీఆర్ఎస్ సత్తుపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా చక్రం తిప్పుతున్న నేత**

**పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య గెలుపునకు వ్యూహ ప్రతివ్యూహాలు**

**ఆయన విజన్‌కు ఫిదా అవుతున్న పార్టీ శ్రేణులు**



సత్తుపల్లి టౌన్, నవంబర్ 14: ఆయన ప్రఖ్యాత 'హెటిరో డ్రగ్స్' అధినేత.. విద్యావంతుడు.. నిరుపేదలకు చేయూతనందించే దాత.. తన కంపెనీలో కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు మండలాలకు చెందిన వందలాది మంది యువతీ యువకులకు ఉద్యోగాలిచ్చిన బిజినెస్ ఐకాన్.. ఆయనే బండి పార్థసారథిరెడ్డి. ఆయన స్వస్థలం వేంసూరు మండలం కందుకూరు గ్రామం. గ్రామాభివృద్ధి కోసం ఆయన ఎంతో తోడ్పడ్డారు. తాను ఎంత ఎత్తుకు ఎదిగినా జన్మభూమిని మరువలేదు. గ్రామస్తులకు ఎల్లప్పుడూ చేదోడు వాదోడుగా ఉంటారు. ఖమ్మం బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు ఆయన కొన్నాళ్ల క్రితం రాజకీయాల్లోకి వచ్చారు. రాజ్యసభ సభ్యుడిగా పదవిని అలంకరించారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో తాజాగా ఆయన బీఆర్ఎస్ సత్తుపల్లి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్నారు. పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య గెలుపు కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు. గ్రామగ్రామాన సమావేశాలను నిర్వహిస్తూ కార్యకర్తల్లో స్ఫూర్తి నింపుతున్నారు. ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని సూచిస్తున్నారు. ట్రబుల్ షూటర్‌గా పార్టీ అంతర్గత సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని ప్రజలకు వివరిస్తున్నారు. ఆయన నేర్పరితనానికి పార్టీ శ్రేణులు ఫిదా అవుతున్నాయి.

# కేసీఆర్‌ది పెట్టే గుణం.. కాంగ్రెస్‌ది తీసుకునే గుణం

కల్లూరు, నవంబర్ 14: ముఖ్యమంత్రి కేసీఆర్‌ది కడుపును చూసి పెట్టే గుణమని, కాంగ్రెస్‌ది జేబు చూసి తీసుకునే గుణమని, ఇందుకు నిదర్శనం తానేనని బీఆర్ఎస్ నాయకుడు మానవతారాయ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 25 ఏళ్ల పాటు కాంగ్రెస్‌లో ఉండి కష్టకాలంలో కాంగ్రెస్‌ను బతికిస్తే తనను, మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్‌ను కాదని ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరిన ఓ వ్యక్తికి రూ.3 కోట్లకు కాంగ్రెస్ టికెట్ అమ్ముకున్నారని దుయ్యబట్టారు. మాజీ మంత్రి రేణుకాచౌదరి ఫైర్‌బ్రాండ్ కాదు.. పైరవీ బ్రాండ్ అని ఆమె గతంలో వైరా టికెట్ అమ్ముకుని ఓ వ్యక్తి మృతికి కారణమైందని, తిరిగి సత్తుపల్లి టికెట్‌ను కూడా తమకు కాదని అమ్ముకుందని ఆరోపించారు. కనీసం టికెట్ల విషయంలో తనకు, సంభానికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే ఇటీవల పార్టీలో చేరిన వారికి టికెట్ ఇచ్చారని దుయ్యబట్టారు. పైరవీకారులకు కాంగ్రెస్ అడ్డాగా మారిందన్నారు. తమ విషయం తెలుసుకున్న ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కేటీఆర్, కేసీఆర్ వద్దకు తీసుకెళ్తే మీ భవిష్యత్ నేను చూసుకుంటానంటూ భరోసా కల్పించిన గొప్ప నాయకుడన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఖాళీ అవుతుందన్నారు. కాంగ్రెస్ గ్యారంటీలు అమలుకాని హామీలని, ముఖ్యమంత్రి ప్రకటించిన బీఆర్ఎస్ మేనిఫెస్టో ప్రజలందరికీ అందుబాటులో ఉండి రానున్న ప్రభుత్వంలో అమలవుతాయని ధీమా వ్యక్తం చేశారు. సత్తుపల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య గెలుపు కోసం శాయశక్తులా కృషిచేస్తామన్నారు. ఎంపీ బండి పార్థసారథిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా సత్తుపల్లి నియోజకవర్గంలో ప్రతి దళిత కుటుంబానికి దళితబంధు అందుతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గ అభివృద్ధికి వందల కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి బాట పట్టించారని, రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే సండ్ర గెలుపుకోసం ప్రతి ఒక్కరూ కృషిచేయాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ కట్టా అజయ్‌బాబు, మాజీ జడ్పీటీసీ మేకల కృష్ణ, మేకా భద్రాచలం, రాచప్రోలు రాజశేఖర్, ధర్నాసి బాలరాజు, బైర్ల వెంకటేశ్వర్లు, లక్కినేని రఘు, గొర్ల సంజీవరెడ్డి, ఇస్మాయిల్, బోబోలు లక్ష్మణరావు, కాటంనేని వెంకటేశ్వరరావు, పెడకంటి రామకృష్ణ, కొరకొప్పు ప్రసాద్, ఎస్కే కమ్లీ, సీహెచ్ కిరణ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మానవతారాయ్

## ఓటుహక్కును వినియోగించుకోవాలి

సత్తుపల్లి రూరల్, నవంబర్ 14: ప్రతి ఒక్కరూ తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని, ఓటును అమ్ముకోవద్దని నోడల్ ఆఫీసర్ జయరామ్ సూచించారు. ఎమండలంలోని గంగారం డీఏవీ పాఠశాల, తుంబూరు, రేజర్ల, సిద్ధారం పాఠశాలలతోపాటు సాయిస్ఫూర్తి ఇంజినీరింగ్ కళాశాలల్లో ఓటుపై అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ఓటరును ఎక్కడైనా ప్రలోభాలకు గురిచేస్తే సీవిజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు ఇచ్చిన 100 నిముషాల్లో అధికారులు పరిష్కరిస్తారన్నారు. ఓటరుకు ఎలాంటి సందేహాలు ఉన్నా హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలన్నారు. ఎంఈవో రాములు, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**టాలెంట్ స్కూల్‌లో..**

సత్తుపల్లి టౌన్, నవంబర్ 14: కలెక్టర్, విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు ఎంఈవో రాములు ఆధ్వర్యంలో పట్టణంలోని టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులకు మాక్ ఎలక్షన్, పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణ, ఓటుహక్కు వినియోగం, తదితర అంశాలపై విద్యార్థులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పులి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

**సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి**

సత్తుపల్లి, నవంబర్ 14: బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీనియర్ సివిల్‌జడ్జి అరుణకుమారి అన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలో బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన 'న్యాయవిజ్ఞాన సదస్సు'లో మాట్లాడారు. గురువులు దైవంతో సమానమని, వారు చెప్పినవి తు.చ తప్పకుండా పాటించి ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. చదువుతో పాటు క్రీడలు కూడా అవసరమని, బాల్య దశలో ఓ లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. మిమ్ములను చదివిస్తున్న తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగేశ్వరరావు, బార్ అసోసియేషన్ సెక్రటరీ వెంకట్రావు, న్యాయవాదులు కిరణ్, రంజని, విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి అరుణకుమారి

**వేంసూరులో..**

వేంసూరు, నవంబర్14: మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా పాఠశాలల వివిధ వేషధారణలతో ఎంతో ఆకర్షణగా నిలిచారు. విద్యార్థులకు నిర్వహించిన పలురకాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. తొలుత నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. విద్యార్థులు నిర్వహించిన పలుసాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**తల్లాడలో..**

తల్లాడ, నవంబర్14: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయా పాఠశాలలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అన్నారుగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. పలుపాఠశాలల్లో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**పెద్దకోరుకొండి పాఠశాలలో..**

కల్లూరు, నవంబర్ 14: మండలంలోని పెద్దకోరుకొండి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన బాలల దినోత్సవంలో రాజ్యసభ సభ్యుడు బండి పార్థసారథిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం కొర్లగూడెం గ్రామంలో కల్లూరు మాజీ సమితి అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు దివంగత యాచవరపు రంగారెడ్డి కాంస్య విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తొలుత పెద్దకోరుకొండి ఆత్మీయ సమ్మేళనంలో బీఆర్ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యను గెలిపించాలని కోరారు.

# సత్తుపల్లిలో సహకార సంఘ వారోత్సవాలు

సత్తుపల్లి, నవంబర్ 14: పట్టణంలోని సొసైటీ కార్యాలయంలో మంగళవారం ప్రాథమిక సహకార సంఘం వారోత్సవాల్లో సీఈవో సతీశ్ జెండా ఆవిష్కరించారు. బ్యాంకు మేనేజర్ రజిత మాట్లాడుతూ నెహ్రూ పుట్టినరోజు సందర్భంగా సహకార సంఘాలను ఏర్పాటు చేయడంతో నవంబర్ 14 నుంచి వారం రోజుల పాటు ఈ వారోత్సవాలు జరుగుతాయన్నారు. రైతులకు ఏ విధంగా సహాయపడాలి...ఎప్పటికప్పుడు బ్యాంక్ అప్‌డేట్ చేయాలని, రైతులు కూడా బ్యాంకు ద్వారా అభివృద్ధి చెందాలని సూచించారు. అసిస్టెంట్ మేనేజర్ రాకేశ్, రూప, క్రాంతి, కుమార్, సతీశ్, విజయ్, ముస్తాఫా పాల్గొన్నారు.